సాక్షి నిర్మల్

శుక్రవారం, 18, ఏప్రిల్, 2025



మన చిత్రం.. II లో▸

ఎలాంటి ప్రాచుర్యానికి నోచుకోని చింతల మానెపల్లి మండలం దిందా గ్రామ కేంద్రంగా 'జగమెరిగిన సత్యం' సినిమా రూపుదిద్దుకుంది. ఈ నెల 18న విడుదల కానుంది.



పెరిగిన పరిహారం

వడ దెబ్బ మృతులకు ప్రభుత్వం రూ.50వేల నుంచి రూ.4లక్షలకు పరిహారం పెంచింది. ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శకాలనూ విడుదల చేసింది. III లో▸

గరిష్టం/కనిష్టం 39.0 /28.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడా ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

హక్కుల వారధి..



మామడ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- భూసమస్యల పరిష్కారానికి భూభారతి
- సాదాబైనామాల పరిష్కారానికి మోక్షం
- పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ పునరుద్ధరణ
- ఈనెల 30వరకు అవగాహన సదస్సులు

నిర్మల్‌చైన్‌గేట్: గత ప్రభుత్వం తెచ్చిన ధరణిలో లోపాల కారణంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టంపై అవగాహన కల్పన, సందేహాల నివృత్తికి ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. గురువారం మామడ మండల కేంద్రంతో పాటు నిర్మల్ రూరల్ మండలం న్యూ పోచంపాడ్ గ్రామంలో కలెక్టర్ ఈ సదస్సులు ప్రారంభించారు.

టైటిల్ డీడ్ పునరుద్ధరణ

గతంలో మాదిరిగా పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ జారీ చేస్తారు. భూభారతి హక్కుల రికార్డుల్లో నమోదైన అందరికీ, తనంతట తాను గాని లేదా భూ యజమాని గాని దరఖాస్తు చేస్తే రికార్డులు పరిశీలించి తహసీల్దార్ పాస్ పుస్తకం ఇస్తారు. ఇందుకు నిర్ణీత రుసుం రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. అభ్యంతరాలుంటే తహసీల్దార్ నిర్ణయంపై ఆర్డీవోకు లేదా కలెక్టరకు అప్పీలు చేసుకోవచ్చు.

తేడా వివరించేందుకే..

ధరణి, భూభారతి మధ్య గల తేడాలను ప్రజలకు వివరించడానికి ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు రోజుకు రెండు మండల కేంద్రాల్లో కలెక్టర్ అధ్యక్షతన సదస్సులు నిర్వహిస్తున్నారు. మే 1వ తేదీ నుంచి జిల్లాలో ఒక మండలాన్ని మోడల్‌గా తీసుకుని భూ భారతి అమలు చేస్తారు. ఇందులో భాగంగా తొలిరోజు మామడ మండలం, న్యూ పోచంపాడ్ గ్రామాల్లో తొలి సదస్సులు నిర్వహించారు. భూ భారతి చట్టంపై ప్రజలకు అర్థమయ్యేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్, కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం చేశారు. సమావేశాలు నిర్వహించే చోట హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేయనున్నారు.

చట్టంలోని కీలకాంశాలు

ధరణి చట్టంలో హక్కుల రికార్డు సవరణకు నియమం లేదు. తప్పుల సవరణకు కోర్టులను ఆశ్రయించాల్సిందే. భూభారతిలో హక్కుల రికార్డుల తప్పుల సవరణకు అవకాశం ఉంది. ధరణిలో ఏర్పడిన సమస్యలకు సంబంధించి సుమారు 1,489 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో హక్కుల రికార్డుల తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డుల్లో పేరు లేని వారు, హక్కుల రికార్డులో నమోదు చేసుకోవడానికి కొత్తగా చట్టం వచ్చిన ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా కలెక్టర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు.

అవగాహన సదస్సుల షెడ్యూల్

తేదీ	మండలం	సదస్సు వేదిక
17.	మామడ	మామడ రైతువేదిక
17.	నిర్మల్ రూరల్ మండలం	న్యూపోచంపాడు రైతువేదిక
21.	బాసర	బాసర రైతువేదిక
21.	ముధోల్	కారేగాం రైతువేదిక
22.	దస్తురాబాద్	దస్తురాబాద్ రైతువేదిక
22.	కడెం	కడెం-పెద్దూర్ రైతువేదిక
23.	తానురు	తానూరు రైతువేదిక
23.	భైంసా	వానల్‌పాడు రైతువేదిక
24.	పెంబి	పెంబి రైతువేదిక
24.	ఖానాపూర్	సత్తనపల్లి రైతువేదిక
25.	లక్ష్మణచాంద	లక్ష్మణచాంద రైతువేదిక
25	సారంగపూర్	సారంగపూర్ రైతువేదిక
26.	కుభీర్	సోనాలి రైతువేదిక
26.	కుంటాల	కుంటాల రైతువేదిక
28.	లోకేశ్వరం	లోకేశ్వరం రైతువేదిక
28.	నర్సాపూర్ (జి)	నర్సాపూర్ నర్సాపూర్(జి) రైతువేదిక
29.	సోన్	సోన్ రైతువేదిక
29.	దిలావర్‌పూర్	గుండంపల్లి రైతువేదిక
30.	నిర్మల్ అర్బన్	నిర్మల్ ఏఎంసీ రైతువేదిక

సాదాబైనామాలకు పరిష్కారం

పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం లభించనుంది. జిల్లాలో 7,472 సాదాబైనామాలు పెండింగ్‌లో ఉన్నాయి. 2014 జూన్ 2వ తేదీ కంటే ముందు, వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి, 12 ఏళ్లుగా అనుభవంలో ఉంటూ 2020, అక్టోబర్ 12వ తేదీ నుంచి 2020 నవంబర్ 10వ తేదీ మధ్య క్రమబద్ధీకరణ కోసం సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై ఆర్డీవోలు విచారణ చేపట్టి అర్హత ఉన్నవారికి ప్రస్తుత రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీలు వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారు. హక్కుల రికార్డుల్లో నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకం ఇస్తారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ అభిలాష అభినవ్

మామడ: భూభారతి చట్టంతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. భూమి రిజిస్ట్రేషన్ అనంతరం లబ్ధిదారుడి పట్టా పాస్‌పుస్తకంలో భూమ్యాపింగ్ నమోదవుతుందని పేర్కొన్నారు. భూకమతాలకు భూధార్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. సీనియర్ ఉన్నతాధికారులు, భూచట్టాల న్యాయనిపుణులు ఎంతో కాలం కసరత్తు చేసిన తర్వాతే భూభారతి చట్టాన్ని రూపొందించారని పేర్కొన్నారు. రైతులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టంలోని ముఖ్యాంశాలను వివరించారు. భూసంబంధిత ఫిర్యాదులను రైతుల నుంచి స్వీకరించి వాటిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చేపట్టిన నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలని సూచించారు. జిల్లా సమాచార పౌర సంబంధాలు, సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సారథి కళాకారులు భూభారతి చట్టంపై కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, వ్యవసాయాధికారి సంధ్యారాణి, రైతులు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంతో కసరత్తు చేశాకే భూభారతి అమలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టం ద్వారా ప్రజలకు భూసంబంధిత సమస్యలు భవిష్యత్‌లో తలెత్తవు. భూమి రిజిస్ట్రేషన్ అనంతరం లబ్ధిదారుడి పట్టా పాస్‌బుక్‌లో భూ మ్యాపింగ్ నమోదవుతుంది. భూకమతాలకు భూధార్ కార్డులు జారీ చేస్తారు. సీనియర్ ఉన్నతాధికారులు, భూ చట్టాలు, న్యాయ నిపుణులు ఎంతో కాలం కసరత్తు చేశాకే భూభారతి చట్టం రూపు దాల్చింది.

– కలెక్టర్ అభిలాష అభినవ్

సమీకృత గురుకులాలేవి?

- ఉమ్మడి జిల్లాలో రెండు మాత్రమే..
- ముధోల్‌లో ఏర్పాటుకు వినతులు



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న రాజేందర్ (ఫైల్)

భైంసా: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బెల్లంపల్లి, మంచిర్యాలకు మాత్రమే సమీకృత గురుకులాలు మంజూరయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ముధోల్, నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో పేదవారే అధికం. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రూ.11,600 కోట్లతో 58 సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఆ జాబితా కూడా విడుదల చేసింది. బాసర సరస్వతీ అమ్మవారు కొలువుదీరిన నిర్మల్ జిల్లాకు ఒక్కటైనా మంజూరు చేయలేదు.

ఒక్కో గురుకులంలో ఇలా..

ఒక్కో గురుకులంలో ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, మినీ థియేటర్, క్రీడా ప్రాంగణం ఉండేలా డిజైన్ చేశారు. ఒక్కో లైబ్రరీలో 5వేల పుస్తకాలు, 60 కంప్యూటర్లు, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. 900 మంది విద్యార్థులు ఒకేసారి కూర్చుని భోజనం చేసేలా డైనింగ్‌హాల్ నిర్మాణం చేపట్టనున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ క్యాంపస్, ప్రతీ డార్మెటరీలో పది బెడ్లు, రెండు బాత్‌రూమ్‌లు, గ్రీన్ క్యాంపస్, సోలార్, విండ్ ఎనర్జీ సదుపాయాలు కల్పించనున్నారు.

వినతిపత్రాలు ఇచ్చినా...

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ముధోల్‌లో ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు, వినతులు వెళ్లాయి. గత నెలలో ముధోల్ మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్ హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. గతంలో సేకరించిన స్థలంలో దీనిని ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సమీకృత గురుకులాలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమీకృత గురుకులాల ఏర్పాటు చేస్తూ విడుదల చేసిన జాబితాలో నిర్మల్ జిల్లాకు ఒక్కటీ లేదని జిల్లా విద్యాధికారి రామారావు తెలిపారు. ఇప్పటివరకు గురుకులాల ఏర్పాటుపై తనకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఐకేపీ కార్యాలయం సందర్శన

కుంటాల: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని గురువారం ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్ సందర్శించారు. రికార్డుల పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత, సీవో శివప్రసాద్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయించాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఎంపికైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న ఇందిరమ్మ నమూనా భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీంఖాన్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ సుదర్శనం

దస్తురాబాద్: అకాల వర్షాలు, ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ సుదర్శనం సూచించారు. గురువారం మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చేపట్టిన విస్తరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్ల పక్కనున్న చిన్న స్తంభాలు తొలగించి పొడవైనవి ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట నిర్మల్ డీఈ నాగరాజు, ఉమ్మడి జిల్లా సివిల్ ఈఈ జనార్దన్‌రావ్, ఇన్‌చార్జి ఏడీఈ శ్రీనివాస్, లైన్‌మన్ సత్యనారాయణ, ప్రేమ్, సిబ్బంది ప్రభాకర్, నజీర్ తదితరులున్నారు.

నూతన ఫీడర్ ప్రారంభం

మామడ: మండలంలోని తాంద్ర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన ఫీడర్‌ను ఎస్ఈ సుదర్శనం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డీఈ నాగరాజు, ఏఈ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

- 302 కేంద్రాల ఏర్పాటు

భైంసాటౌన్: జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొనుగోళ్ల బాధ్యతను మహిళా సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జీసీసీలకు అప్పగించారు. ఇప్పటికే కొన్నిచోట్ల కేంద్రాలు ప్రారంభించగా తూకాలు చేపట్టాల్సి ఉంది. గన్నీ సంచులు, హమాలీల కొరత రానివ్వకుండా చర్యలు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 1,62,414 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారుల అంచనా. ఈ మేరకు 302 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటిలో డీఆర్‌డీఏకు 153, పీఏసీఎస్‌లకు 144, జీసీసీలకు ఐదు కేంద్రాలు అప్పగించారు. దొడ్డురకం 1.37 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం 24వేల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేశారు. జిల్లాకు 47 లక్షల గన్నీ సంచులు అవసరముండగా, 7 లక్షలు అందుబాటులో ఉన్నాయి. 1.55లక్షల సంచులను 31 కేంద్రాలకు పంపించగా, మరో 15లక్షల కొత్త సంచులు రానున్నాయని, రైస్‌మిల్లర్ల నుంచి మరో 12లక్షలు రానున్నట్లు అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కోసం టెంట్, తాగునీరు, టాయిలెట్ వసతి కల్పించాలని నిర్వాహకులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సివిల్ సప్లయ్ డీఎం సీహెచ్ సుధాకర్ తెలిపారు. ఇప్పటికే 123కేంద్రాలు ప్రారంభం కాగా, తూకాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, మూత్రశాలలు, నీడ, ఇతర వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.


ప్రయోగశాలను సందర్శించిన కలెక్టర్



మైక్రోస్కోప్ ద్వారా ప్రయోగాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సోన్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం సందర్శించారు. పాఠశాలలోని ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలను పరిశీలించారు. ప్రయోగశాలలో విద్యార్థులకు ఖగోళ, భౌతిక శాస్త్రాల ప్రయోగాలు, మానవ శరీర ధర్మ శాస్త్రానికి సంబంధించి పరిజ్ఞానం పెంపొందించేలా వివిధ రకాల నమూనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రయోగశాలలోని నమూనాలతో ఆచరణాత్మక విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులకు అన్ని అంశాలు సులువుగా అర్థమవుతాయని తెలిపారు. ఈ ప్రయోగశాలను ఉపయోగించి పాఠశాలలోని విద్యార్థులందరికీ నైపుణ్యాలు పెంపొందించేలా ఆచారణాత్మక విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలోని ఏ ప్రైవేట్ పాఠశాలలోనూ ఇలాంటి ప్రయోగశాల లేదని తెలిపారు. ఇలాంటి సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తి, నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. కాగా, జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించేలా, కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రత్యేక చొరవతో సుమారు రూ.19.50లక్షలు ఖర్చు చేసి మొదటగా జిల్లాలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ప్రయోగ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నిర్మల్ రూరల్ మండలం అనంతపేట్ కేజీబీవీ, మామడ మండలం పొన్కల్ ప్రభుత్వ పాఠశాల, తాండూరు మండలం బోసి ప్రభుత్వ పాఠశాలలో ఒక్కోచోట సుమారు రూ.5లక్షల వ్యయంతో ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి రామారావు, సెక్టోరల్ అధికారి రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి వినోద్, తహసీల్దార్ మల్లేశ్, మండల విద్యాధికారి పరమేశ్వర్, హెచ్‌ఎం ఆరాధన, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృమూర్తి దీవెనలతో ప్రవేశాలు



విద్యార్థులు, పోషకులతో ఉపాధ్యాయులు

సారంగపూర్: మండలంలోని చించోలి(బీ) ప్రాథమిక పాఠశాలలో మాతృమూర్తుల దీవెనలతో తల్లి తన కన్నబిడ్డను ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించే కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేశ్ శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం 8గంటల నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించడంతో పాటు నూతనంగా పాఠశాలలో ప్రవేశాలు కల్పించనున్న విద్యార్థుల వివరాలు సేకరించి వారిని పాఠశాలలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈపాఠశాలలో చదువుకుని అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు చదువులో వెనుకబడ్డ, ఎందుకు వెనుకబడ్డామో.. అనే వివరాలతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించి ఇదివరకు ఇక్కడ చదుకువున్న విద్యార్థుల ప్రతిభను పోషకుల ముందు ప్రదర్శించారు. ఇది చూసిన గ్రామస్తులు పిల్లలను అధికసంఖ్యలో పాఠశాలలో చేర్పించేందుకు ముందుకువచ్చారు. పాఠశాలలో ప్రవేశాలు పెంచేందుకు సరికొత్త ఆలోచన చేసిన ప్రధానోపాధ్యాయుడు గణేశ్‌ను గ్రామస్తులు, సిబ్బంది, నాయకులు అభినందించారు. త్వరలోనే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తాను పనిచేసే పాఠశాలను తీర్చిదిద్దుతానని సదరు హెచ్‌ఎం గణేశ్ చెప్పారు.

మృతదేహాలను తెప్పించేందుకు ఆదేశం

సోన్: ఇటీవల దుబాయ్‌లో హత్యకు గురైన ఇద్దరు తెలంగాణవాసుల మృతదేహాలను త్వరగా స్వదేశానికి తెప్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జపాన్ పర్యటనలో ముఖ్యమంత్రి గురువారం స్పందించి ఆదేశించారని పేర్కొన్నారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, మృతదేహాలను త్వరగా ఇండియాకు తీసుకువచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్‌సాగర్ దుబాయ్‌లో బేకరీషాప్‌లో పాకిస్తానీయుల చేతిలో హత్యకు గురి కావడం బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నాణ్యమైన సేవలందిస్తాం



మాట్లాడుతున్న డీఈ శర్మన్

ఖానాపూర్: ఖానాపూర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈ శర్మన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో వినియోగదారుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన సేవా శిబిరానికి హాజరై మాట్లాడారు. సేవల్లో ఎలాంటి అంతరాయమున్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలూ త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్‌డివిజనల్ ఇంజినీర్ రమ్యజ్యోతి, డీలర్ రమణప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ధర ఢమాల్!



ఓలాలో మిర్చి ఆరబెడుతున్న రైతు

- పంటపై తెగుళ్ల ప్రభావం
- భారీగా తగ్గిన దిగుబడి
- చేలలోనే వదిలేస్తున్న పంట
- ఆందోళనలో జిల్లా రైతులు

కుంటాల: మిర్చి సాగు.. రైతులను కంటతడి పెట్టిస్తోంది. పెట్టుబడుల కోసం అప్పుచేసిన మిర్చి రైతులకు కాలం సహకరించక చివరికి కన్నీళ్లే మిగిలాయి. చేతికొచ్చిన పంట మార్కెట్‌లో అమ్మగా వచ్చిన డబ్బులు కూలీలకు సరిపోలేదని కొందరు రైతులు చెబుతున్నారు. మరోవైపు కూలీ ధరలు పెరగడంతో పంట సేకరించకలేక చేనులోనే ఉంచాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు.

అమాంతం పడిపోయిన ధర

ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 288 ఎకరాల్లో 221 మంది రైతులు మిర్చి సాగు చేశారు. పంట ఎదిగే సమయంలోనే తెగుళ్లు సోకి దిగుబడిపై ప్రభావం పడింది. ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అధికారుల సూచనలు, సలహాల మేరకు మందులు వాడి పంటలను రక్షించుకున్న రైతులకు మార్కెట్‌లో మద్దతు ధర లేదు. గతేడాది క్వింటాల్ మిర్చి ధర రూ.19వేల నుంచి రూ.23వేల వరకు పలికింది. ప్రస్తుతం ఆ ధర రూ.7వేల నుంచిరూ.10వేలకు పడిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పంటచేనులోనే వదిలేస్తూ..

ఎకరా మిర్చి సాగు చేసిన రైతులు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వచ్చాక ధర లేక ఈసారి నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ఇదంతా ఒక ఎత్తైతే.. కూలీలు దొరకక మరో బెంగ రైతులను వెంటాడుతోంది. మిర్చి సేకరణకు మొదట్లో కూలీలకు కిలోకు రూ.10 చెల్లించేవారు. కూలీల కొరత కారణంగా ప్రస్తుతం ఈసారి రూ.30 చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీ లేక కొందరు రైతులు పంటను కూలీలతో సేకరిస్తున్నారు. మరికొందరు పంట తెంపలేక చేనులోనే ఉంచాల్సిన దుస్థితి ఏర్పడింది. పంట విక్రయించేందుకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం కూడా లేక మహారాష్ట్రలోని ధర్మాబాద్, సాంగ్లి, జాల్న ప్రాంతాలకు తరలించాలంటే దూరభారంతో పాటు వ్యయప్రయాసాలు అధికమవుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఎర్ర బంగారానికి గిట్టుబాటు ధర కల్పించాలని మిర్చి సాగు చేసిన జిల్లా రైతులు కోరుతున్నారు.

పంట చేనును దున్నించిన



ఈసారి మూడెకరాల్లో మిర్చి సాగు చేసిన. మొదట్లో తెగుళ్ల బెడద ఉండగా మందులు పిచికారీ చేసి పంటను కాపాడుకున్న. ప్రస్తుతం మిర్చి సేకరణకు కూలీల ఖర్చు పెరగడంతో చేనును దున్నించిన.

– ఎండీ యూసుఫ్, ఓలా

ధరలు తగ్గినయ్



గతేడాది ఆశించిన రీతిలో ధరలు ఉండడంతో మిర్చి సాగు చేసిన. ఈసారి అమాంతం ధరలు పడిపోయినయ్. కనీసం పెట్టుబడి ఖర్చులు రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలె.

– సంతోష్ పటేల్, లింబా(కే)

క్లుప్తంగా

దాడి కేసులో ఇద్దరు రిమాండ్

జన్నారం: అటవీశాఖ మహిళ బీట్ అధికారి వి ధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమెతోపాటు భర్తపై దాడి చేసిన కేసులో ఇద్దరిని గు రువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఈనెల7న జన్నారం మండలం కొత్తపేట సమీపంలో ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా బీట్ అధికారి రుబీనా తలాత్ ఆపింది. ఆమె తోపాటు భర్త అఫ్రోజ్ వెళ్లాడు. నా ట్రాక్ట ర్‌ను ఆపుతావ అని కవ్వాల్ గ్రామానికి చెం దిన రి యాజొద్దీన్, ఎజాజొద్దీన్‌లు బీట్ అధికారి విధులకు ఆటంకం కలిగించాడు. ఆమె భర్తపై దాడి చేయడంతో కేసు నమో దైంది. విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరిని 14 రోజులు రిమాం డ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

భార్యపై గొడ్డలి దాడి ఘటనలో భర్తకు..

కోటపల్లి: వివాహేతర సంబంధంపై ప్రశ్నిం చిన భార్యపై గొడ్డలితో దాడి చేసిన ఘటన లో నిందితుడు భర్తను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేం దర్ తెలిపారు. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బానోత్ పున్నం తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్న భార్య లక్ష్మిని గొడ్డలితో దాడిచేసి గాయప ర్చాడు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

నెన్నెల: మండలంలోని మైలారం మత్తడి వాగు నుంచి అనుమతి లేకుండా బెల్లంప ల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను జోగాపూర్ వద్ద పట్టుకున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామన్నారు. యజమాను లు గడ్డం సాయికుమార్, కొమ్ము రాజన్న, డ్రైవర్లు పసుల రవీందర్, అత్తి సాయిలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మం డలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

తాంసి: మండలంలోని జామిడికి చెందిన పర్ధాన్ దేవుబాయి ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఒంటరిగా ఉంటున్న ఆమె గురు వారం ఉదయం ఇంట్లో దేవుని చిత్రపటం వద్ద దీపం పెట్టి ఉపాధి పనికి కూలీలతో వెళ్లింది. వెలిగించిన దీపం వస్తువులకు అం టుకొని మంటలు వ్యాపించింది. గమనిం చిన గ్రామస్తులు వెంటనే మోటార్ల ద్వారా నీటిని చల్లి మంటలార్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తు లు, రూ.20వేల నగదు కాలిపోయాయి. ఇం టి పైకప్పు దెబ్బతింది. దాదాపు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మానిష్‌రెడ్డి ఘటనస్థలానికి చేరుకుని బాధిత మహిళను పరామర్శించారు. నెలకు సరిపడా సరుకులతోపాటు నగదు అందజే శారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు అశోక్ ఆర్థికసాయం అందజేశాడు.



సినిమా చిత్రీకరణలో నటీనటులు

జగమెరిగిన సత్యం

- చింతలమానెపల్లి మండలం దిందా గ్రామంలో చిత్రీకరణ
- దర్శకుడు, నటులూ స్థానికులు..
- నేడు విడుదల

సినిమా అంటే ఒక క్రేజ్.. రంగులతో కనిపించే సినిమా చాలామందికి కల.. ఇలాంటి ఓ సినిమా మన ప్రాంతంలో రూపుదిద్దుకుంటే ఆ ఆనందం వేరు. ఎలాంటి ప్రాచుర్యానికి నోచుకోని ఆ గ్రామంలోని వెనుకబడిన పరిస్థితులు, గ్రామస్తుల సహజ అమాయకత్వం ఈనేపథ్యంలో చింతలమానెపల్లి మండలంలోని దిందా గ్రామ కేంద్రంగా రూపుదిద్దుకున్న చిత్రం.. జగమెరిగిన సత్యం..ఈనెల 18న సినిమా విడుదల కానుంది.

చింతలమానెపల్లి: మండలంలోని దిందా.. ఒక మారుమూల గ్రామం.. త్వరలో రంగస్థలానికి పరిచయమవుతోంది. దట్టమైన అటవీ ప్రాంతంలో రవాణా సౌకర్యాలకు, గ్రామం అభివృద్ధికి నోచుకోకుండా ఉంది. జగమెరిగిన సత్యం టైటిల్‌తో విడుదల అవుతున్న చిత్రం 80 శాతం గ్రామంలోనే చిత్రీకరించారు. గ్రామ సమీపంలోని వాగు, చింతలమానెపల్లి మండలం రవీంద్ర నగర్ వారసంత, గూడెం ప్రాణహిత నది వంతెన, పెంచికల్‌పేట్ పెద్దవాగు, కౌటాల మండల కేంద్రం, పక్కనే మహారాష్ట్రలోని అహేరి వద్ద కొన్ని సన్నివేశాలను తెరకెక్కించారు. కౌటాల ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మొదటి సన్నివేశం చిత్రీకరణతో సినిమా ప్రారంభించారు.

1994లో గ్రామీణ పరిస్థితుల నేపథ్యం..

1994లోని గ్రామీణ నేపథ్యం, అప్పటి మనుషుల కట్టుబాట్లు, దర్శకుడి చిన్నతనంలోని అనుభవాలను ఆధారంగా చిత్రం రూపొందింది. ప్రేమ సన్నివేశాలు, భావోద్వేగాలు, సంస్కృతి, సంగీతం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు పాలె తిరుపతి తెలిపారు. ఇందులో పలు సన్నివేశాల్లో దిందా గ్రామస్తులను బ్యాక్‌గ్రౌండ్‌లో నటించేందుకు అవకాశం కల్పించారు. సినిమాలో ఐదు పాటలు ఉండగా బతుకమ్మ పాటను గాయకురాలు మంగ్లీ ఆలపించారు. రాణా దగ్గుబాటి, సాయిపల్లవి నటించిన విరాట పర్వం చిత్రానికి పనిచేసిన సురేష్ బొబ్బిలి ఈచిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. హీరో రవితేజ మేనల్లుడు అవినాష్‌వర్మ, ఆద్యారెడ్డిలను హీరో, హీరోయిన్లుగా తొలిపరిచయం చేశామని, మరో హీరోయిన్‌గా నీలిమ పతకంశెట్టి నటించినట్లు దర్శకుడు తెలిపారు.

దర్శకుడు స్థానికుడే..

దర్శకుడు పాలె తిరుపతి స్వగ్రామం పెంచికల్‌పేట్ మండలం చెడ్వాయి. ఆయనకు చింతలమానెపల్లి మండలంలో బంధువులు ఉండగా వారి ఇంటికి వచ్చేక్రమంలో స్థానిక గ్రామాలపై పరిచయం ఉండగా సినిమా చిత్రీకరణకు కారణమైంది. గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన మంచిర్యాలలో డిగ్రీ పూర్తిచేశారు. సినిమాలపై ఆసక్తితో చిత్రరంగానికి వెళ్లి దర్శకత్వ శాఖలో 8 ఏళ్లు పనిచేశారు. ఈక్రమంలో 'కొరియన్ శీర్షిక అహేరి'పేరుతో లఘు చిత్రం రూపొందించారు. అది సాధించిన విజయం ఇచ్చిన స్ఫూర్తితో మరో నాలుగు లఘు చిత్రాలను రూపొందించగా, ఈ అనుభవంతో జగమెరిగిన సత్యం చిత్రాన్ని తెరకెక్కించారు. కథానాయకుడికి చిన్నతనంలో సోదరుడిగా చింతలమానెపల్లి మండలం గంగాపూర్‌కు చెందిన దండ్రె మణికంఠ(బబ్లూ) బాలనటుడిగా నటించాడు.

జిల్లాలో ఆలస్యంగా విడుదల

జగమెరిగిన సత్యం సినిమా కుమురం భీం జిల్లాలో కాస్త ఆలస్యంగా విడుదల కానుంది. ఈనెల 18 (శుక్రవారం)న మంచిర్యాలలో, తెలంగాణలో 33 థియేటర్లలో విడుదల చేస్తున్నారు. కాగజ్‌నగర్‌లో ఇతర సినిమాలకు ముందుగానే షెడ్యూల్ ఖరారు అయి ఉండడంతో కొన్నిరోజుల అనంతరం విడుదల అవుతుందని సినిమా బృందం తెలిపింది.



నటులకు సీన్ వివరిస్తున్న దర్శకుడు పాలె తిరుపతి

గర్వంగా భావిస్తున్నాం



దిందా గ్రామం పేరు వెండితెరపై వినిపించడం పట్ల మేము గర్వంగా భావిస్తున్నాం. స్థానికంగా చిత్రీకరణ జరగడంతో కొంతమందికి ఉపాధి లభించింది. అటవీ ప్రాంతంలో ఉండే మా గ్రామం అభివృద్ధిలో వెనుకబడి ఉంది. సినిమాతో గ్రామానికి ప్రచారం లభించడం మేము సంతోషంగా ఉన్నాం.

– దోశ రామన్న, దిందా

సహకారం అందించాం



సినిమా చిత్రీకరణకు అనువైన ప్రదేశాల కోసం సోదరుడు అయిన డైరెక్టర్ నన్ను సంప్రదించారు. ఎన్నో ప్రాంతాలను పరిశీలించి దిందా గ్రామాన్ని ఎంపిక చేసుకున్నాం. సినిమా చిత్రీకరణ పూర్తయ్యే వరకు సినిమా బృందానికి నాతో కలిసి గ్రామస్తులు, స్థానిక ప్రజలు సహకారాలు అందించాం. సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నాం.

– దేవాడి రాజన్న, గంగాపూర్

బాలనటుడిగా మరిచిపోలేనిది



సినిమాలో నటించే అవకాశం రావడం ఒక వరం లాంటిది. నేను 8వ తరగతి చదువుకునే సమయంలో దగ్గరి బంధువు అయిన సినిమా దర్శకుడు అవకాశం కల్పించారు. నటనలో అనుభవం లేకున్నా దర్శకుడు, నటుల సహకారంతో బాలనటుడిగా నటించాను. ఈ అనుభవం మరిచిపోలేనిది.

– దండ్రె మణికంఠ(బబ్లూ), గంగాపూర్

ఓపెన్ 'పది', ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 20నుంచి ప్రారంభమయ్యే ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంచిర్యాలలో పదో తరగతికి రెండు పరీక్ష కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు మూడు, బెల్లంపల్లిలో పదో తరగతికి ఒకటి, ఇంటర్‌కు రెండు కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు 666, ఇంటర్ విద్యార్థులు 1192 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు స్టడీ సెంటర్ల ద్వారా పంపిణీ చేస్తామని, విద్యార్థులతోపాటు సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకు రావద్దని సూచించారు.

న్యాయవాదిపై దాడి దుర్మార్గపు చర్య



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: న్యాయవాదులపై దాడులు దుర్మార్గపు చర్య అని మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు అన్నారు. ఈ నెల 16న సూర్యాపేట జిల్లా న్యాయవాది మాంతపురం కిషోర్‌పై దాడిని ఖండిస్తూ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భుజంగ్‌రావు, న్యాయవాదులు మాట్లాడుతూ దాడులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుల అంజనేయులు, ధత్తు, గోపతిరవి, శ్రీరాములు, జాడీ తిరుపతి, శ్రీకాంత్ తదిరులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

లక్సెట్టిపేట: న్యాయవాది కిషోర్‌పై దాడిని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులు నళినికాంత్, కోశాధికారి సుమన్ చక్రవర్తి, న్యాయవాదులు భూమరెడ్డి, సురేందర్, అక్కల శ్రీధర్, కిరణ్‌కుమార్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య



పోశెట్టి మృతదేహం

సారంగపూర్: ఒంటరితనం భరించలేక వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కుటుంబీకులు, ఎస్సై తెలిపిన వివరాలు.. మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన తోకల పోశెట్టి(65)కి ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్యకు ఇద్దరు కుమార్తెలు, చిన్న భార్యకు ఒక కుమార్తె ఉన్నారు. అయితే గత 20 ఏళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక హనుమాన్ ఆలయంలో వంట, బస చేస్తూ కాలం వెళ్లదీశాడు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికావడంతో తిరిగి ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులకు ముఖం చూపించలేక, ఒంటరిగా బతకలేక తనలో తానే కుమిలిపోయాడు. ఈక్రమంలో రెండు రోజులుగా పోశెట్టి కనిపించడం లేదని గ్రామస్తులు అనుకుంటున్నారు. గ్రామశివారు ప్రాంతంలోని దడే గుట్ట వద్ద ఒర్రె వైపు పశువులు మేపేందుకు వెళ్లిన వారికి గురువారం పోశెట్టి ఉరేసుకుని కనిపించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు, ఆయన కుటుంబీకులకు చేరవేశారు. గ్రామస్తులు అందించిన సమాచారంతో ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత..

నెన్నెల: ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గడ్డం లావణ్య (47), భర్త శంకర్ గౌడ్‌తో కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట హోటల్ నిర్వహిస్తోంది. హోం లోన్ తీసుకుని ఇల్లు నిర్మించుకున్నారు. హోటల్ పెట్టుబడి కోసం మరికొంత అప్పు చేశారు. వ్యాపారం సరిగ్గా సాగక పోవడంతో అప్పు తీర్చడం కష్టమైంది. కిస్తీలు చెల్లించకపోవడంతో వడ్డీ పెరిగిపోయింది. అప్పులు ఎలా తీర్చాలో అని ప్రతిరోజు బాధపడేదని కుటుంబీకులు చెప్పారు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున లావణ్య ఇంట్లో కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు చుటూ పక్కల వెతకగా భీరన్నమఠ్రి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద ఆమె చెప్పులు లోట కనిపించాయి. అనుమానంతో బావిలో నీటిని మోటార్ల ద్వారా తోడగా అందులో శవమై కనిపించింది. కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.



గడ్డం లావణ్య(ఫైల్)

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం

దహెగాం: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. మండలంలోని కోత్మీర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కందూరి రాజు కథనం ప్రకారం..దహెగాం మండలం కోత్మీర్ గ్రామానికి చెందిన బొలిశెట్టి వెంకటేశ్‌కు కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లికి చెందిన జ్యోతితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వెంకటేశ్ సింగరేణికార్మికుడిగా బెల్లంపల్లిలో పనిచేస్తున్నాడు. వీరి కాపురం సాఫీగా సాగింది. ఏడాది క్రితం నుంచి భర్త, అత్త భాగ్య, మామ మొండయ్య అదనపు కట్నం తేవాలని ఆమెను వేధించసాగారు. బుధవారం వేధించడంతో భరించలేని జ్యోతి అందరి ముందే పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతుంది. జ్యోతి తల్లి పెర్క సుశీల ఫిర్యాదుతో భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



అశోక్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన రైతు గాండ్ల అశోక్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం.. అశోక్ (45) గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. చాలాసేపటి వరకు రాకపోవడంతో ఫోన్ చేస్తే ఇంట్లో ఉంది. దీంతో బంధువు అయిన కార్తీక్‌ను పొలం వద్దకు పంపించారు. పొలం ఒడ్డున ఒక చెప్పు, బావిలో మరో చెప్పు కనిపించింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో బావిలో వెతకగా మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు బావిలో జారిపడటంతో ఈత రాక అందులో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శైలజ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బ్లేడ్‌తో గొంతుకోసి హత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: బ్లేడ్‌తో ఒకరి గొంతు కోసి హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని బంగారుగూడలో చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం..బంగారుగూడకు చెందిన ముద్దంగుల విఠల్, అదేకాలనీలో జాబిర్‌షా ఉంటున్నాడు. గురువారం విఠల్ ఫోన్‌లో ఓ నంబర్ డయల్ చేయాలని జాబిర్ షా అడిగాడు. ఇందుకు విఠల్ నిరాకరించడంతో బ్లేడ్‌తో ఆయన గొంతుకోసి హత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలైన విఠల్‌ను రిమ్స్‌కు తరలించారు. బాధితుడి భార్య పోచవ్వ ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆరుగురి బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరుగురు పాత నేరస్తులను గురువారం తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. వేంపల్లిలో దోపిడీ కేసులో నిందితులైన రమేశ్, అవినాశ్, చందు, సంతోశ్, అశోక్, కృష్ణలను ఏడాదిపాటు షరతులతో కూడిన బైండోవర్ చేశారు.

తల్వార్‌తో ఫొటో దిగిన ఇద్దరిపై కేసు

గుడిహత్నూర్: బర్త్ డే పార్టీలో తల్వార్‌తో ఫొటో దిగి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ భీమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన యువకులు తరుణ్ గిత్తే, సునీల్ బుధవారం రాత్రి మహంకాళి మందిరం వద్ద జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం వేడుకకు హాజరైన మండల కేంద్రానికి చెందిన మిత్రులు నరేశ్, వెంకటి తల్వార్లతో ఫొటోలకు ఫోజు ఇచ్చారు. సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఉండడంతో వీరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయుధాలతో ఫొటో, వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని కుమార్‌పేట్‌కు చెందిన తోకల నాగరాజు అశోక్‌రోడ్‌లోని తన పాన్‌షాప్‌లో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన నుంచి 3.65 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.4వేల వరకు ఉంటుందన్నారు. అదేవిధంగా తిర్పెల్లికి చెందిన కరోర శుభం ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన నుంచి 3.42 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.3762 ఉందని వివరించారు.

అసభ్యపదజాలంతో దూషించిన వ్యక్తిపై..

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో కాంగ్రెస్ నాయకులను దూషించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 16న వాట్సాప్ గ్రూప్‌లో కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన శైలేష్ బొత్కుర్‌వార్ దూషించినట్లు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. నాయకుల వ్యక్తిత్వాన్ని కించపర్చడంతోపాటు ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టు ఉందని తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

జూదరుల అరెస్టు

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామ సమీపంలో గురువారం నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7500 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని జైలుకు తరలిస్తున్న ఎస్సై

బెల్లంపల్లి: చోరీ కేసులో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం.. 2022లో టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనం జరిగింది. చోరీ కేసులో నిందితుడిగా ఉన్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన హరదీప్‌సింగ్ కొంతకాలం నుంచి కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. నిందితుడి ఆచూకీని కనుగొని పోలీసులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చాకచక్యంగా పట్టుకుని గురువారం బెల్లంపల్లి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. అనంతరం ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరు..



దేశీదారు, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

తాంసి: అక్రమంగా మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రేండ్ల విజేందర్ తెలిపారు. మండలంలోని లీంగూడ గ్రామానికి చెందిన ఆత్రం దేవ్‌రావు, టేకం బర్కత్‌రావులు మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పక్కాసమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి దాడి చేశారు. మద్యం విక్రయిస్తుండగా ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10వేల విలువ గల 90 ఎమ్ఎల్ కలిగిన 280 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా దేశీదారు, నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది శ్రీధర్, హనుమంత్ పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు..

నేరడిగొండ: మండలంలోని లింగట్లలో కొందరు గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఇచ్చోడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫేఖార్ అహ్మద్ సిబ్బందితో గురువారం తనిఖీ నిర్వహించారు. సాబ్లే రంజిత్, సాబ్లే సంజీవ్‌లు గంజాయితో పట్టుబడ్డారు. రంజిత్ వద్ద సుమారు 184 గ్రాముల డ్రై గంజాయి, సంజీవ్ వద్ద 223 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇళ్లపట్టాలు ఇప్పించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి నివాసం ఉంటున్న పుర ప్రజలకు జీవో నెంబర్ 76 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు ఎ. వెంకటస్వామి, బి.పూర్ణిమ, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు ఆడేపు రాజమౌళి, బి.లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల రాజేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వినోద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

సారంగపూర్: మండలంలోని నిర్మల్-స్వర్ణ రహదారిపై ధని గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని జామ్ గ్రామానికి చెందిన ఎనుగందుల సాగర్ తన బైక్‌పై నిర్మల్ వైపు నుంచి సారంగాపూర్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని మతిస్థిమితం లేని వ్యక్తిని ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడ్డ అతడు అక్కడికక్కడే మృతి చెందగా సాగర్‌కు, ఆయనతోపాటు బైక్‌పై ఉన్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతులను స్థానికులు 108లో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూనియర్ కళాశాలల నుంచి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వచ్చే విద్యా సంవత్సరం 2025-26కు గాను రెప్యూటెడ్(కార్పొరేట్) జూనియర్ కళాశాలల పథకం కోసం జూనియర్ కళాశాలల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనారిటీ విద్యార్థులకు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించేందుకు జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి రెప్యూటెడ్ జూనియర్‌కళాశాలను నూతనంగా ఎంపిక చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.